క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడానికి వారి సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ వరంగల్ -1 డిపో మేనేజర్ పుప్పాల అర్పిత తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు హనుమకొండలోని వరంగల్ -1 డిపో నుంచి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లలోని ప్రయాణికులు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలిపి, సలహాలు, సూచనలు అందించాలని అర్పిత కోరారు.

విరాళం



రఘునాథపల్లి: అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన పొట్లపల్లి వరప్రసాద్‌కుమార్ స్వగ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం రూ.25 వేలు విరాళం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. గురువారం పాఠశాలలో హెచ్‌ఎం శోభన్‌బాబుకు ఆయన నగదు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు వరప్రసాద్‌కుమార్ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు వరప్రసాద్‌కుమార్‌ను అభినందించారు.

వ్యాపార అవసరాలకు కమర్షియల్ సిలిండర్లే వాడాలి



స్వాధీనం చేసుకున్న సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీ అప్పగిస్తున్న డీటీ శ్రీనివాస్

జనగామ: హోటల్, బిర్యానీ సెంటర్స్ యజమానులు తప్పనిసరిగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు మాత్రమే వినియోగించాలని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. జనగామ పట్టణంలోని పలు హోటళ్లను ఆయన గురువారం తనిఖీ చేశారు. పలు హోటళ్లలో వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయా హోటల్స్ యజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లను వీరభద్ర గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు డీటీ శ్రీనివాస్ తెలిపారు.

దేవాదుల నీటితో చెరువులు నింపాలి

బచ్చన్నపేట: దేవాదుల జలాలతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలను నింపాలని రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం దేవాదుల పంపింగ్ ఏఈకి వినతి పత్రాన్ని అందించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కానుగంటి బాలచందర్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



జనగామ: పట్టణంలోని శ్రీకన్వెన్షన్ హాల్‌లో గురువారం సోల్ మిషన్ వరల్డ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వక్త నీలం సురేష్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో సోల్ మెషిన్ వరల్డ్ అధ్యక్షుడు ప్రదీప్, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ గణేష్, డీపీఎస్ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సోల్ మిషన్ వరల్డ్ ఎల్ఎఫ్‌పీ క్రియాయోగ పుస్తక ఆవిష్కరణ చేశారు.

ఇద్దరికి జైలు

రఘునాథపల్లి: దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులకు న్యాయమూర్తి ఏడాది జైలుశిక్ష, రూ 1000 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ గురువారం తెలిపారు. నర్మెట మండలం హనుమంతపూర్ గ్రామానికి చెందిన ఇరిగి రమేశ్ 2023 అక్టోబర్ నెలలో మండలంలోని రామరాయనిబంగ్లాలో గ్రామ పంచాయతి భవన నిర్మాణం కోసం తన సెంట్రింగ్ బాక్సులను అమర్చాడు. 118 సెంట్రింగ్ బాక్సులు అపహరణకు గురి కాగా రమేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రఘుపతి కేసు నమోదు చేసుకొని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన అల్లిబిల్లి శంకర్, పానుగంటి సుధాకర్‌లను నాడు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా గురువారం ఎస్సై నరేష్, కోర్టు కానిస్టేబుల్ వెంకటేష్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి శశి ఇద్దరికి ఏడాది జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ 1,000 చొప్పున జరిమానాగా శిక్ష ఖరారు చేస్తూ గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



జనగామ: పూజ చేస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్, భక్తులు



జనగామ: సాయిబాబా ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



జనగామ: మూలబావి సీతారామచంద్రస్వామి దేవస్థానంలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలను భక్తులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా, రాఘవేంద్రస్వామి తదితర ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయకమిటీల ఆధ్వర్యంలో దాతలు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. జనగామ పట్టణంలోని గుండ్లగడ్డ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో డీసీపీ రాజమహేంద్రనాయక్ ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే పలు పాఠశాలల్లో వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.



నర్మెట: సాయిమందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



గురువును సన్మానిస్తున్న డాక్టర్ సుగుణాకర్‌రాజు



జనగామ: శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో..



కొడకండ్ల: రామన్నగూడెంలో..



జనగామ రూరల్: గురువులను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్



బచ్చన్నపేట: సన్మానం పొందిన ఉపాధ్యాయులతో బీజేపీ నాయకులు

అభ్యసన సామర్థ్యాల్లో భేష్

- దేశవ్యాప్తంగా 50 ఉత్తమ జిల్లాల్లో జనగామకు చోటు
- కలెక్టర్ ప్రత్యేక చొరవతో న్యాస్‌లో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: పర్‌ఫార్మెన్స్ ఎసెస్‌మెంట్ రివ్యూవ్ అండ్ అనలిసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్(పరఖ్–న్యాస్)సర్వే ఇటీవల జరగగా ఫలితాలు వెల్లడయ్యాయి. కాగా, సర్వేలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదలలో దేశంలోని 50 ఉత్తమ జిల్లాల్లో జనగామ స్థానం(ర్యాంకు) సాధించిందని కలెక్టర్ రిజ్వాన్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కోసం జిల్లాలో అమలుచేసిన ప్రత్యేక కార్యాచరణ వల్లే ఇది సాధ్యమైందని కలెక్టర్.. విద్యాశాఖ అధికారులను కలెక్టరేట్‌లో అభినందించారు. కాగా డీఈఓ..కలెక్టర్‌ను సన్మానించి స్వీట్ అందజేశారు. ఈ సందర్భంగా పరీక్షలపై తీసుకున్న జగ్రత్తలు వివరించారు.

ప్రత్యేక కార్యాచరణతో ర్యాంక్

ప్రత్యేక కార్యాచరణతో ర్యాంకు సాధించడం జరిగింది. ఆగస్టు మాసం నుంచే ప్రత్యేక కార్యాచరణ ,ప్రణాళిక రూపొందించుకుని అమలు చేశారు. ఎస్‌సీఆర్టీ రాష్ట్ర విద్య శాఖ సహకారంతో వారు నిర్ణయించిన కార్యక్రమాలకు తోడు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం. జిల్లాలో 3, 6 ,9 తరగతులు బోధించే ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి రిసోర్సు గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రూపు సబ్జెక్టుల్లో ప్రశ్నల నిధి తయారుచేసి అన్ని పాఠశాలలకు అందజేసి, ఆయా పాఠశాలలోని 3, 6, 9 తరగతుల విద్యార్థులచే అభ్యసనం చేయించారు. కాగా, డీఈఓ భోజన్న మాట్లాడుతూ జిల్లాలో 3వ తరగతిలో 33 పాఠశాలలకు చెందిన 640 మంది విద్యార్థులకు, 6వ తరగతిలో 27 పాఠశాలలకు చెందిన 688 విద్యార్థులకు, 9వ తరగతిలో 31 పాఠశాలలకు చెందిన 805 విద్యార్థులకు మొత్తం 91 పాఠశాలలకు చెందిన 2,133 మంది విద్యార్థులపై ఈ సర్వే చేపట్టామన్నారు. ఫార్మెటివ్ అస్సెస్మెంట్ టెస్ట్, సమ్మెటివ్ అసిమెంట్ టెస్టుల్లో కూడా న్యాస్ ఆధారిత ప్రశ్నలను రూపొందించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా కలెక్టర్ పాఠశాల స్థాయిలో ప్రతి నెలలో నిర్వహించే పరీక్షలపై పాఠశాల వారీగా ప్రధానోపాధ్యులతో సమీక్ష నిర్వహించడం, మంచి ఫలితాలు సాధించిన వారిని హెచ్‌ఎంలు అభినందించినట్లు చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఆర్‌డబ్ల్యూఈ కార్యక్రమాలు రూపొందించడం జరిగిందన్నారు. మధ్య స్థాయి పిల్లలకు కష్టమైన ప్రశ్నల సమాధానాలు గుర్తించడంపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. దీంతో న్యాస్ పరీక్షలో దేశంలో మంచి ర్యాంకును సొంతం చేసుకున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్టుదల, అధికారుల కృషితో ర్యాంక్ సాధించామని తెలిపారు.

జాతీయ స్థాయిలో ర్యాంకుల వివరాలు

3వ తరగతిలో 16వ ర్యాంక్
6వ తరగతిలో 35వ ర్యాంక్
9వ తరగతిలో 33వ ర్యాంక్

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

- ఆర్డీఓ వెంకన్న

రఘునాథపల్లి: ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని, ఓటరు జాబితా పారదర్శకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. బీఎల్‌ఓలు ఓటరు జాబితా సవరణపై బాధ్యతగా పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్లు జైపాల్‌రెడ్డి, నరేందర్ నూతన ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులు తదితర వాటిపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఫణికిషోర్, ఆర్ఐలు శరత్‌చంద్ర, రవీందర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సిమెంట్, ఐరన్ వ్యాపారులు నిబంధనలు పాటించాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ప్రభుత్వం సూచించిన ధరలకు సిమెంట్, ఐరన్ సరఫరా చేయాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సిమెంట్, ఐరన్ వ్యాపారులతో ఆర్డీఓ గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్, ఐరన్ వ్యాపారులు ఇదే అదనుగా ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయించవద్దని, మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు సిమెంట్, ఐరన్ అందించాలని అన్నారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవారు



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో చండికా అమ్మవారు శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం విశేష అలకంరణ, భక్తుల సహకారంతో మూడు క్వింటాళ్ల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, అర్చకులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శనలు

లింగాలఘణపురం: మండల కేంద్రంలో గురువారం మహిళ శక్తి సంబరాలపై గట్టగల్ల సంజీవ ఆధ్వర్యంలో సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటలతో కళా ప్రదర్శనలు చేశారు. మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుతులు అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని ముగిద్దాం అనే అంశంతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 8,9 10 తరగతి విద్యార్థులకు జూన్ 4వ తేదీన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈపోటీలో జిల్లా స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రశంసపత్రాలు, మెమెంటోలను అందించింది. కాగా, గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విజేతలకు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. వ్యాసరచనలో మనోజ్ఞ శ్రీ(కార్మెల్ కాన్వెంట్ స్కూల్, పాలకుర్తి), అక్షయ (కేజీబీవీ బచ్చన్నపేట), ఎం.సంయుక్త (జెడ్పీఎస్ఎస్ ధర్మకంచ) కె.నందిని (కేజీబీవీ, స్టేషన్ ఘన్‌పూర్), చిత్రలేఖనంలో సహస్ర (సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, పాలకుర్తి), సీహెచ్ శివ జాగృతి (కార్మెల్ కాన్వెంట్), కె.గణేష్ (లింగాలఘన్‌పూర్), శ్రీ విద్య (కేజీబీవీ, స్టేషన్‌ఘన్‌పూర్) బహుమతి గెలుపొందారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, హరితదళం జిల్లా ఇన్‌చార్జ్ గౌసియా బేగం పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



అంబేడ్కర్ ఫొటో ఉన్న కరెన్సీని ప్రదర్శిస్తున్న నాయకులు

జనగామ రూరల్: కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని దేశ ప్రధానికి లక్ష పోస్ట్ కార్డ్స్ ఉద్యమంలో భాగంగా జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ అధ్యక్షతన 10వేల పోస్ట్ కార్డ్‌ల కార్యక్రమాన్ని గురువారం పట్టణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ పోస్ట్ కార్డులను ముద్రించేందుకు సొసైటీ సాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ ఉద్యమాన్ని జిల్లా నలుమూలలకు విస్తరించేందుకు కార్యాచరణను రూపొందించుకుంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజమౌళి, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభిగౌడ్, సుగుణాకర్ రాజు, విజయ్, రాజు, మల్లిగారి రాజు పాల్గొన్నారు.

నిడిగొండలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలోంచి బంగారు గొలుసు అపహరణ



ఘటనా స్థలిలో వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో చైన్ స్నాచింగ్ చోటు చేసుకుంది. ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని యువకులు రెండు తులాల బంగారు గొలుసు అపహరించుకొని వెళ్లిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దగోని సుజాత ఉదయం తన ఇంటి ముందు వాకిలి ఊడుస్తుంది. ఆమె ఇంటి ముందు బైపాస్ రోడ్డుపై హనుమకొండ నుంచి జనగామ వైపు బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు గమనించారు. బైక్‌ను నిలిపి ఒకరు.. ఇంటి ముందు పని చేస్తున్న సుజాత వద్దకు చేరుకున్నాడు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లడానికి ప్రయత్నించాడు. వెంటనే ఆమె అప్రమత్తమై ప్రతిఘటించింది. అయినా సుజాతను కిందకు తోసేసి రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని వేగంగా బైక్‌పై పారిపోయారు. దీంతో సుజాత స్వల్పంగా గాయపడింది. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలిని పరిశీలించి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు పరిసరాల్లో సీసీ కెమెరాలు పరిశీలించారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు నిందితులు వెళ్తున్నట్లు గుర్తించి బైక్ నంబర్‌ను పరిశీంచగా అది కాజీపేటలో దొంగిలించినట్లుగా గుర్తించారు. బైక్ పై వెళ్తున్న ముగ్గురు నిందుతుల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. నిందుతులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బాధితురాలి సోదరుడు పెద్దగోని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సేయింట్ మేరీస్ పాఠశాల డైరెక్టర్ తుమ్మ శ్రీలతరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్‌లోని సేయింట్ మేరీస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారి సింగరాజుపల్లి పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని రామరాజుపల్లికి చెందిన ఎనగందుల నర్సయ్య(45) అనే హమాలీ కార్మికుడు సింగరాజుపల్లి వివేరా దాబా వద్ద రోడ్డు పక్కన నడుస్తుండగా సూర్యాపేట వైపు నుంచి జనగామ వైపు వెళ్తున్న బైకు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

బచ్చన్నపేట: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్‌లు గద్దల నర్సింగారావు, పెద్ది రాజిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొన్నె, దబ్బగుంటపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.

బీఆర్ఎస్ పూర్వవైభవానికి..

దేవరుప్పుల: తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఉద్భవించిన బీఆర్ఎస్ పూర్వవైభవం కోసం పాటుపడుదామని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి(పీఎస్ఆర్) పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సీతారాంపురంలో ఎంపీటీసీ క్లస్టర్ సమావేశాల్లో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సమయాత్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం'

జఫర్‌గఢ్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నప్పటికినీ విద్యారంగంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

బచ్చన్నపేట: ఊర కుక్కల దాడిలో దూడ మృతి చెందిన సంఘటన పోచన్నపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పరిదె మల్లేష్ రోజూ మాదిరిగా తన వ్యవసాయ బావి వద్ద పశువులను కట్టేసి రాత్రి ఇంటికి వచ్చాడు. ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా రెండు నెలల దూడను ఊరకుక్కలు దాడి చేసి చంపినట్లు గుర్తించాడు. ఊరకుక్కల దాడిలో దూడలు మృతి చెందుతుండటంతో లక్షల విలువైన పాడిగేదెలు పాలు ఇవ్వడం లేదని, దీంతో జీవన భృతి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పలువురు రైతులు కోరారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభం

పాలకుర్తి: రైతులకు ఆయిల్‌పామ్ సాగుతో లాభం కలుగుతుందని ఆయిల్ ఫీల్డ్ అధికారి పూజారి వరుణ్ గౌడ్ అన్నారు. గురువారం మండలం ముత్తారంలోని రైతు మొరిశెట్టి వెంకటరమణ, వల్మిడి గ్రామంలోని వెంకటేశ్ భూమిల్లో సబ్సిడీపై తీసుకున్న ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రిప్ అధికారి చిట్టి, రైతులు వడ్డెర శేఖర్, వల్మిడిలో రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణను మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడు పోశాల కృష్ణపటేల్ ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఆర్థికసాయం

జనగామ రూరల్: పసరమడ్ల గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు బోయిని ఆంజనేయులు మృతి చెందాడు. కాగా, గురువారం జిల్లా ఒగ్గు బీర్ల సంఘం యూత్ విభాగం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.17వేల సాయం అందజేశారు.

ఫతేపూర్‌లో..

చిల్పూరు: ఫతేపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు భీమగోని రాజు భార్య కవిత పాము కాటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ మాలోత్ రమేష్ నాయక్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల సాయం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

శిక్షణ తరగతులు ప్రారంభం

జనగామ రూరల్: 8, 9వ తరగతి విద్యార్థులను అన్ని రంగాల్లో సంపూర్ణంగా తీర్చిదిద్దడం కోసం వాయిస్ ఫర్ చేంజ్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో శిక్షణ తరగతులను నిర్వహించింది. కాగా, ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎం జె. లచ్చిరాం, స్టాఫ్ సెక్రటరీ బి.వాసు, వాయిస్ ఫర్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. రతన్ సింగ్, హరిప్రసాద్, ఎల్.రాములు, ఎల్.పరమేశ్వర్, బి. శత్రు, జే.ఉపేందర్, ఎల్.రాజయ్య, జి.వీరన్న, జి.సారయ్య, బి.స్వరూప, జి.స్వాతి పాల్గొన్నారు.

మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ

స్టేషన్‌ఘన్‌పూర్: రంగరాయగూడెం గ్రామానికి నూతనంగా మంజూరైన మహిళా భవనం నిర్మాణం కోసం గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఐత సత్యనారయణ, సీసీ రజిని, వీఓ అరుణ, అంగన్‌వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి

జనగామ రూరల్: 60 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయకుంటే ఉద్యమిస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, జిల్లా నాయకుడు బూడిద గోపి అన్నారు. గురువారం వారు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. మంగ బీరయ్య రాములు, శంకర్, కోయల్ కార్ శివాజీ, కె.సత్య, రాంజీ, కర్రె బీరయ్య, శివరాత్రి సమ్మయ్య, సుధాకర్, కర్రె మహేందర్, కర్రె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: అభివృద్ధి పనులకు రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రంగరాయగూడెం గ్రామ శివారు నుంచి ఈరవెన్ను వరకు రూ.5లక్షలు ఎస్‌డీఎఫ్ ఫండ్స్‌తో చేపట్టనున్న రోడ్డు పనులను గురువారం ప్రారంభించి మాట్లాడారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బచ్చన్నపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని కొమురవెల్లి దేవస్థాన డైరెక్టర్ కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

చిల్పూరు: 30 ఏళ్ల క్రితం లింగంపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 443/1/2లో ఎస్సీలకు కేటాయించిన భూముల్లో తాము కాస్తులో ఉండగా కొందరు రాజకీయ నాయకుల పలుకుబడితో భూముల కబ్జాకు పాల్పడుతున్నారని, వారి నుంచి మా భూములు మాకు ఇప్పించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ సరస్వతికి విన్నవించారు. కాగా, తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్ఐతో శుక్రవారం సర్వే చేయించి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. ప్రభుత్వ భూమిని అధికారులకు తెలువకుండా కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధిత రైతులు బాధిత రైతులు చిలుక రాజేందర్, కొలిపాక లక్ష్మి, స్వరూప, మేక స్వామి, రమేష్, మోతె ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

బండలగట్టులో వెలిగిన అఖండ దీపం

చిల్పూరు: ఫతేపూర్ పంచాయతీ పరిధిలోని బండలగట్టు శివగిరిశివగంగేశ్వరి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం 5 గంటలకు జ్యోతి స్తంభం వద్ద అఖండ దీపాన్ని ఆలయ నిర్మాణ దాత, అర్చకులు వేల్పుల లక్ష్మీగట్టయ్య వెలిగించారు. అఖండ దీపారాధన చూసేందుకు భక్తులు చేరుకుని దర్శనం చేసుకున్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధంకావాలి

జఫర్‌గఢ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

బహుజనులంతా ఏకం కావాలి

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు బహుజనులంతా ఏకం కావాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ జెరిపోతుల మల్లయ్య అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గ్రామీణ వైద్యులపై సీపీఐ నేతల వ్యాఖ్యలు సరికాదు

దేవరుప్పుల: పల్లెల్లో అన్ని వర్గాల ప్రజలకు నిత్యం ప్రథమ చికిత్సలు చేసే గ్రామీణ వైద్యులపై సీపీఐ నేతల విమర్శలు చేయడం శోచనీయమనీ గ్రామీణ వైద్యుల సంఘం (ఆర్ఎంపీ, పీఎంపీ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు పసునూరి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.